క్లుప్తంగా

ప్రశాంతంగా డీవైఈఓ పరీక్ష



తిరువూరు: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం డెప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ నియామక పరీక్ష తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. 110 మంది అభ్యర్థులను ఈ కేంద్రానికి కేటాయించగా 54 మంది హాజరయ్యారు. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహణకు కళాశాల అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సీపీఐ సీనియర్ నేత సూర్యప్రకాశరావు మృతి



ఇబ్రహీంపట్నం: సీపీఐ సీనియర్ నాయకుడు, ప్రజా నాట్యమండలి జిల్లా నేత నడకుదిటి సూర్యప్రకాశరావు (84) మృతిచెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు విజయవాడ వైద్యశాలలో కుటుంబ సభ్యులు చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచాడు. 45 ఏళ్లుగా యువజన సమాఖ్య, ప్రజా నాట్యమండలి, కార్మిక రంగాల్లో చురుకైన పాత్ర పోషించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు.

నేటి నుంచి తిరునాళ్ల

ఎ.కొండూరు: అంకమ్మ మహాలక్ష్మీ అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవాలు చీమలపాడు గ్రామంలో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని దేవాలయ కమిటీ చైర్మన్ మరీదు జమలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మారెమ్మ తల్లి కొలువు, 27న అంకమ్మ మహాలక్ష్మీ అమ్మవార్ల ఊరేగింపు, 28న పూల కొప్పెర, 29న జల బిందెలు, 30న అమ్మవార్ల బోనాలు, ఉయ్యాల కార్యక్రమం, ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 34 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీలో భాగంగా శనివారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా, ప్రథమ సంవత్సర విద్యార్థులు 30 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు నలుగురు పరీక్షలకు హాజరుకాలేదు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి మొత్తం 473 మంది విద్యార్థులకు గాను 443 మంది పరీక్ష రాశారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారదా జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 36 మందికి గాను 32 మంది పరీక్షకు హాజరయ్యారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి



తిరువూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. తిరువూరు మండలం ఆంజనేయపురంలో ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పించడంతో పాటు ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పలువురు బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్చుకున్నారు. ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, మచ్చా శ్రీనివాసరావు, యాకూబ్ ఆలీ, కొండలరావు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు డి.చంద్రశేఖర్, మల్లాది స్వాతి, కల్యాణం శిరీష, వి.కామేశ్వరి ఆపాత మధురాలు పేరుతో పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, వర్ధమాన గాయకులకు వేదిక కల్పించాలని సూచించారు. సీనియర్ గాయకుడు డేవిడ్ రాజు మాట్లాడుతూ.. సాంస్కృతిక సంస్థలు ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. మీరాకుమార్, తటవర్తి సూర్యనారాయణ, నాగేశ్వరరావు, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు



సిబ్బందికి సూచనలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్ఓ జగన్‌మోహన్



వైద్యాధికారులకు చెక్కు అందజేస్తున్న దాత శ్రీమన్నారాయణ

- డెప్యూటీ డీఎంహెచ్ఓ జగన్‌మోహన్
- ముసునూరు పీహెచ్‌సీ సందర్శన

ముసునూరు: డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీల్లో సౌకర్యాలకు ప్రాధాన్యతనిచ్చి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జగన్‌మోహన్ అన్నారు. శనివారం ముసునూరు పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఓపీ వివరాలు, రికార్డులను, ప్రసూతి సేవలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి, రోగులకు కల్పిస్తున్న వసతి, సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రసూతి వార్డుకు వెళ్లి బాలింతలకు, ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని పరిశీలించారు. ప్రాంగణంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 24 గంటలూ రోగులకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా వైద్యాధికారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్, ఎంపీహెచ్ఈఓలు మురళి, అలెగ్జాండర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి విరాళం

ముసునూరు: ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు సౌకర్యాల కల్పనకు దాతల సహకారం అభినందనీయమని నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జగన్‌మోహన్ అన్నారు. ముసునూరు పీహెచ్‌సీ ప్రసూతి గదికి పూర్తి స్థాయి విద్యుత్ సరఫరా, రక్త పరీక్ష, ప్రయోగశాలకు అవసరమైన సెంట్రీ ఫ్యూజ్ ఏర్పాటుకు స్థానిక దాత, విశ్రాంత ఇంజినీరు చలసాని శ్రీమన్నారాయణ శనివారం రూ.20 వేలు విరాళంగా అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాతను వైద్యాధికారులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌వైజర్లు మురళి, అలెగ్జాండర్, ఏఎన్ఎంలు పాప, భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మునగ సాగుతో రైతులు అధిక లాభాలు గడిస్తున్నారని ఏపీఓ మాధవరెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద శాతం సబ్సిడీతో సాగవుతున్న మునగ, వివిధ రకాల పండ్ల తోటలను శనివారం క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. కేతనకొండ గ్రామంలో ఓ రైతు వేసిన మునగ తోటలో చివరి కోతలో సైతం టన్నుకు పైగా దిగుబడి రావడాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు మునగ సాగుకు ప్రభుత్వం రూ.35 వేల చొప్పున రెండేళ్లలో రూ.70 వేలు అందిస్తోందన్నారు. పంట ఫలసాయం రైతులకు అదనపు ఆదాయంగా ఉంటోందని చెప్పారు. సొంత భూమి కలిగిన రైతులతో పాటు ప్రభుత్వం ద్వారా పట్టాలు పొందిన లంక భూముల రైతులు కూడా పథకానికి అర్హులన్నారు. ఆసక్తిగల రైతులు ఉద్యాన పంటల్లో వంద శాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకుని పంటలు సాగుచేసుకోవాలని సూచించారు.

కట్టుబడిపాలెంలో కార్డన్ సెర్చ్



కట్టుబడిపాలెంలో కార్డన్‌సెర్చ్‌లో భాగంగా పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ కిషోర్‌బాబు



బైక్ రికార్డులపై ఆరా తీస్తున్న సీఐ కిషోర్‌బాబు తదితరులు

కట్టుబడిపాలెం(జి.కొండూరు): మండలంలోని కట్టుబడిపాలెంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మైలవరం సీఐ కె.కిశోర్‌బాబు ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన తనిఖీల్లో 230 మందిని వ్యక్తిగతంగా కలిసి పలు ప్రశ్నలు సంధించారు. ఇళ్లలో ఉంచిన 86 బైకుల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు లేని నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న కార్డన్ సెర్చ్‌లో భాగంగా కట్టుబడిపాలెంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై సమీక్ష



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రధాన వీధుల్లో మురుగు కాల్వలపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని శానిటేషన్, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మురుగుకాల్వలను ఆక్రమణలతో మురుగు తొలగింపునకు ఇబ్బందులు ఎదురవుతున్నందున వెంటనే ఆయా కాల్వలపై ఉన్న షాపులు, ఇతర నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. పలువురు మురుగుకాల్వలపై కాంక్రీట్ బండలు ఏర్పాటు చేయగా, మరికొందరు మెట్ల నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో మురుగు తొలగింపు సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినవారికి వెంటనే నోటీసులు జారీచేయాలన్నారు. నోటీసులకు స్పందించనివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా అక్రమ నిర్మాణాల తొలగింపునకు అయ్యే ఖర్చును కూడా సదరు నిర్మాణదారుల నుంచే వసూలు చేస్తామని కమిషనర్ తెలిపారు. ఇకనైనా మురుగు కాల్వలపై నిర్మాణాలు చేపట్టినవారు వెంటనే వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, శానిటరీ, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తగ్గిన కౌలు ధరలు



కౌలుకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన భూమి

వత్సవాయి : మండలంలో వ్యవసాయభూమి కౌలు ధరలు ఈ ఏడాది భారీగా తగ్గాయి. గతేడాది మిర్చి సాగులో పెట్టుబడులు పెరగడంతోపాటు పంట దిగుబడులు భారీగా తగ్గడం, ధరలు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో ఈసారి భూములను కౌలుకు తీసుకునేందుకు కౌలురైతుల్లో ఆసక్తి సన్నగిల్లింది. దీంతో భూముల కౌలు ధరలు తగ్గిపోయాయి.

ఎకరం కౌలు రూ.15 వేలు ..

గత నాలుగైదు ఏళ్లగా మిర్చికి మంచి ధర పలుకుతుండటంతో భూ యజమానులు కౌలు ధరలను పెంచేశారు. దీనికితోడు కౌలురైతులు కూడా పోటీలు పడి భూములను కౌలుకు తీసుకుని సాగుచేశారు. దీంతో నాలుగేళ్ల కిందట రూ.40 వేలు పలికిన ఎకరం కౌలు గతేడాది రూ.25వేలు నుంచి రూ.30వేలు పలికింది. కౌలు నగదు కూడా ముందుగానే చెల్లించేవారు. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ఎకరం భూమి కౌలు ధర రూ.15 వేలుగా పలుకుతోంది. మిర్చి సాగులో పెట్టుబడులు ఏటా పెరుగుతుండటం, గతేడాది దిగుబడులు తగ్గడంతోపాటు ధరలు లేక రైతులు నష్టాలపాలు కావడం ఈ పరిస్థితికి కొంత కారణంగా కాగా, కౌలుకు భూములను తీసుకుని వ్యవసాయం చేసేవారి సంఖ్య కూడా ఏటా తగ్గిపోతుండటం కూడా కౌలు ధరలు తగ్గిపోవడానికి మరో కారణమని చెప్పవచ్చు.

సుబాబులు వేసేందుకు ఆసక్తి..

గతంలో కౌలు ధరలు తక్కువగా ఉండడంతో ఎక్కువ భూములు ఉన్న యజమానులు సుబాబుల్ పంటను సాగుచేశారు. మధ్యలో మిర్చికి మంచి ధర లభించడంతో కౌలు రేట్లు పెరిగాయి. దీంతో అత్యధికులు సుబాబుల్ పంటను తొలగించి మరీ భూములను కౌలుకు ఇచ్చారు. ప్రస్తుతం కౌలుధరలు తగ్గడంతో కొంతమంది రైతులు తిరిగి సుబాబుల్ పంటను వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

ఆగిరిపల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని హెచ్‌సీఎల్ కంపెనీ హెచ్ఆర్ బాలచంద్రధర్ అన్నారు. మండలంలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకాడమీ డైరెక్టర్ సాంబశివరావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఎస్.వి.సురేంద్ర పాల్గొన్నారు.

లాడ్జీలు, కల్యాణ మండపాలకు నోటీసులు

ఇబ్రహీంపట్నం: పోలీసులకు సమాచారం ఇవ్వకుండా లాడ్జీలు, హోటళ్లు, కల్యాణ మండపాల్లో ఎవరికీ రూమ్‌లు అద్దెకు ఇవ్వరాదని కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో పలు హోటళ్లు, లాడ్జీలు, కల్యాణ మండపాలకు శనివారం పోలీసులు నోటీసులు అందజేశారు. మండలంలోని జూపూడి నోవా, నిమ్రా కళాశాలల్లో జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగనున్నందున అసాంఘిక శక్తులు అల్లర్లు సృష్టించి కౌంటింగ్ ప్రక్రియకు భంగం కలిగించే అవకాశం ఉన్న నేపథ్యంలో నోటీలు జారీ చేశామని సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఎవరికీ రూమ్స్ కేటాయించవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ఆగిరిపల్లి: ప్రభుత్వ హోమియో వైద్యశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని వైద్యురాలు రజిత అన్నారు. శనివారం ఆగిరిపల్లికి చెందిన యండూరి జగన్‌మోహన్‌రావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు ప్రణీత్ ప్రభుత్వ హోమియో వైద్యశాలలోని యోగా కేంద్రానికి రూ.75 వేలతో రేకుల షెడ్డు నిర్మించారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ నాగేశ్వరి

నూజివీడు: కిశోర బాలికలకు బాల్య వివాహాల నిరోధం, రుతుక్రమ విజ్ఞానం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పోతురెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు ఏసీడీపీఓ నాగేశ్వరి మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సత్ప్రవర్తనతో చదువు పట్ల శ్రద్ధ చూపుతూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాలని, అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకు కూరలు, పండ్లు, పాలు, పీచు పదార్థాలు, ఐరన్ సంబంధిత ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా, పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి విద్య, వెల్ఫేర్ అసిస్టెంట్ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మైలవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



తిరువూరు గ్రంథాలయంలో చిత్రలేఖనం నేర్చుకుంటున్న విద్యార్థులు

మైలవరం: గ్రంథాలయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు టి. సురేష్‌బాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీనిలో భాగంగా శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తక సమీక్షలు చేసి నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనం వలన విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నాగార్జున, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు..

తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. సుమతీ శతకం పద్యాల కంఠస్థంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చదరంగం, యోగాసనాలలో శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనంలో మెలకువలను గ్రంథాలయాధికారి పద్మావతి వివరించారు. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు భరతకుమారి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 176 మంది గైర్హాజరు

నూజివీడు: డివిజన్ పరిధిలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 176 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 206 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 30 మంది మాత్రమే హాజరయ్యారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 65 మందికి గాను ముగ్గురు, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ కేంద్రంలో 30 మందికి గాను ఆరుగురు, ముసునూరు హైస్కూల్ సెంటర్‌లో 35 మందికి గాను ముగ్గురు, చాట్రాయి హైస్కూల్ సెంటర్‌లో 36 మందికి గాను 10 మంది, ఆగిరిపల్లి హైస్కూల్ సెంటర్‌లో 40 మందికి గాను ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. పరీక్షలు సజావుగా సాగేలా ఆయా పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీఓలు పర్యవేక్షిస్తున్నారు.

ముసునూరు: మండలంలో పదో తరగతి హిందీ సప్లిమెంటరీ పరీక్షకు శనివారం ముగ్గురు హాజరయ్యారని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ముసునూరు పరీక్షా కేంద్రంలో శనివారం హిందీ పరీక్ష నిర్వహించారు. 35 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే హాజరయ్యారని చెప్పారు.

నూజివీడులో మోస్తరు వర్షం



నూజివీడులో కురుస్తున్న వర్షం



ఆగిరిపల్లిలో కురుస్తున్న వర్షం

నూజివీడు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 7 గంటల నుంచే జల్లులు మొదలయ్యాయి. మధ్యమధ్యలో సాయంత్రం వరకు భారీ జల్లులు కురిశాయి. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నూజివీడు పట్టణం, మండలంలో భారీ వర్షంతో రోడ్లు వరదనీటితో నిండిపోయాయి. డ్రెయిన్లు వరదనీటితో నిండిపోయి అందులోని చెత్తాచెదారం వరద నీటి ఉధృతికి రోడ్లపైకి కొట్టుకు వచ్చింది. పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. వర్షం పడటంతో ఇటీవల ప్రభుత్వం రాయితీపై రైతులకు పంపిణీ చేసిన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను నాటే పనులను రైతులు చేపట్టారు. ఈ వర్షం మామిడి తోటలకు మంచిదని రైతులు పేర్కొంటున్నారు.

ఆగిరిపల్లిలో..

అధిక ఉష్ణోగ్రత, ఉక్కబోతతో అల్లాడిన మండల ప్రజలు వర్షానికి సేద తీరారు. అల్పపీడన ప్రభావంతో శనివారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకొని వర్షం కురిసింది. ఆగిరిపల్లి ప్రధాన రహదారిలో డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. ఈ వర్షం వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాట్రాయిలో..

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మండలంలో మోస్తరు వర్షం కురిసింది. మెట్ట దుక్కులకు అనువుగా మారడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేసిన పచ్చి రొట్ట విత్తనాలను విత్తుతున్నారు.

ముసునూరులో...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఒక మోస్తరు వర్షపాతం నమోదైంది. వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మండలంలోని మామిడి, రబీ వరి రైతులు చివరి దశలో ఉన్నందున పంట దెబ్బ తింటుందనే ఆందోళన చెందుతున్నారు.

గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సృజన అన్నారు. స్థానిక దుర్గాపురం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం వ్యాక్సినేషన్, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. అలాగే ప్రసవం ఖచ్చితంగా ప్రభుత్వ ఆస్పత్రిల్లోనే చేయించుకోవాలన్నారు. ఆశ, ఆరోగ్యకేంద్రం సిబ్బంది సేవలను వినియోగించుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరియమాత గుహ వార్షికోత్సవం



బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): గ్రామంలోని రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి వద్ద క్రైస్తవుల సహాయమాత పేరుతో నిర్మించిన మరియమాత గుహ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగ్గయ్యపేట విచారణ ఫాదర్ గుడిసె జయరాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరియమాత ఆశీస్సులు పొందాలంటే ప్రతిఒక్కరూ పవిత్రమైన జీవన విధానాన్ని కలిగి ఉండాలని సూచించారు. తొలుత గ్రామంలోని వీధుల్లో మరియమాత విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సెయింట్ ఆన్స్ సిస్టర్లు అనిత, భాగ్యలక్ష్మి, సుష్మ, ఉపదేశి అలోషియస్, సంఘ పెద్దలు మేరీ వినీత, గండమాల సురేష్, కొరివి బాబురావు, ఉప్పుతోళ్ల బాలస్వామి, పోలంపల్లి దావీదు, సంఘస్తులు పాల్గొన్నారు.